## మంత్రి సీతక్క స్వగ్రామానికి ఆర్టీసీ బస్సు

- ములుగు- పొట్లాపూర్, వయా జగ్గన్నపేటకు సర్వీసు
- సేవలను ప్రారంభించిన అధికారులు



ములుగు-పొట్లాపూర్‌కు ప్రారంభమైన బస్సు ఎదుట కండక్టర్

ములుగురూరల్, డిసెంబర్14 : రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సొంత గ్రామమైన జగ్గన్నపేటకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ములుగు మండలంలోని మంత్రి స్వగ్రామం జగ్గన్నపేటకు కొంత కాలంగా బస్సు సౌకర్యం లేదు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినందున గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సీతక్క ఆర్టీసీ అధికారులను బస్సు నడపాలని ఆదేశించారు. ఈ నెల 13న రూట్ సర్వే నిర్వహించిన అధికారులు గురువారం నుంచి బస్సు సేవలను ప్రారంభించారు. ములుగు నుంచి మాధవరావుపల్లి, మదనపల్లి, జగ్గన్నపేట, చిన్నగుంటూరుపల్లి, పత్తిపల్లి మీదుగా పొట్లాపూర్ వరకు ఈ బస్సు నడపనున్నట్లు ములుగు ఆర్టీసీ కంట్రోలర్ బైకాని మోహన్ వివరించారు. ఆయా గ్రామాల ప్రజల రవాణా సౌకర్యార్థం ప్రతి రోజు ఉదయం 8:40, మధ్యాహ్నం 1:20, సాయంత్రం 6:10 వేళల్లో ములుగు నుంచి బస్సు ట్రిప్పులను నడుపనున్నట్లు తెలిపారు.

# బీఆర్‌ఎస్ నేతపై దాడికి యత్నం

- తృటిలో తప్పించుకున్న యుగేంద్రాచారి
- ధ్వంసమైన కారు..
- కాంగ్రెస్ నేతలపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు


కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించగా ధ్వంసమైన కారు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సోషల్ మీడియా వింగ్ ఇన్‌చార్జి పూసాల యుగేంద్రాచారిపై కొందరు వ్యక్తులు దాడికి విఫల ప్రయత్నం చేశారు. ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ విషయమై యుగేంద్రచారి గురువారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాసింపల్లి గ్రామానికి చెందిన పూసాల యుగేంద్రాచారి బీఆర్‌ఎస్‌లో చురుకైన నాయకుడిగా, సోషల్ మీడియా వింగ్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వీరాభిమాని అయిన యుగేంద్రాచారి ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో చురుకుగా పనిచేశారు. కాగా బుధవారం రాత్రి సుమారు 7గంటలకు బీఆర్‌ఎస్ ఆఫీసు నుంచి యుగేంద్రాచారి, గణపురం పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావులు కారులో పరకాల వైపునకు వెళ్తుండగా కుందూరుపల్లి సమీపంలో నలుగురు వ్యక్తులు ఎర్టిగా కారుతో ఓవర్‌టేక్ చేసి అడ్డగించారు. కారులో నుంచి కొట్టేందుకు ఏవో వస్తువులు తీస్తుండగా వెంటనే కారును భయంతో యుగేందర్ వెనక్కి తిప్పారు. ఈ క్రమంలో కారు ధ్వంసం కాగా, అదే స్పీడ్‌తో భూపాలపల్లికి చేరుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి సమాచారం అందించారు. గురువారం భూపాలపల్లికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో పాటు ఎస్పీని కాంగ్రెస్ నాయకుల దాడులను అరికట్టాలని చిట్యాల, టేకుమట్లలో జరిగిన ఘటనలను, యుగేంద్రాచారి దాడి ఘటనపై వివరించారు. యుగేంద్రచారిపై భూపాలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు సాయిచరణ్‌తో పాటు మరో ముగ్గురు దాడికి ప్రయత్నించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని కోరారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ఇంటితో పాటు కాలిపోయిన సామగ్రిని పరిశీలిస్తున్న బాధితులు

ములుగురూరల్, డిసెంబర్14 : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన ములుగు మండలంలోని బంజరుపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బండి కొమురయ్య-లక్ష్మి దంపతులు రాత్రి టీవీ చూసి, తెల్లవారే వరకు దానిని ఆఫ్ చేయలేదు. ఉదయం పనుల నిమిత్తం కొమురయ్య, లక్ష్మి బయటకు వెళ్లగా టీవీ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రావడంతో ఇంటికి మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులతో పాటు వంట సామగ్రి, బట్టలు కాలి బూడిదయ్యాయి. కాగా, ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-315036

**WANTED**
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, జేబీకే కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

# స్కూలు గుర్తింపు కోసం వసూళ్లు

- డీఈవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- కలెక్టర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదులు
- శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు

హనుమకొండ సిటీ : ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, టీసీ బుక్కుల జారీలో డబ్బు వసూలు ఆరోపణలపై హనుమకొండ డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో ఎండీ అబ్దుల్ హై గురువారం తెలిపారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్ గుర్తింపు రెన్యువల్ కోసం శ్రీవాణి డబ్బులు డిమాండ్ చేసినట్లు డీఈవోకు ఫిర్యాదు అందింది. ఈ పని కోసం మొదట కొంత మొత్తాన్ని ఓ ఫోన్ నంబర్‌కు డిజిటల్ పేమెంట్ చేయగా, మిగిలిన కొద్ది మొత్తం కోసం శ్రీవాణి ఫోన్‌లో ప్రైవేట్ స్కూలు నిర్వాహకుడిని అడిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటికే జరిగిన లావాదేవీలు, ఫోన్‌లో మాట్లాడిన రికార్డులతో డీఈవోకు ఫిర్యాదు చేశారు. మరోవైపు డీఈవో ఆఫీసులో పనుల కోసం వచ్చే వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని శ్రీవాణిపై కలెక్టర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదులు అందాయి. గూగుల్ పే, ఫోన్ పే రూపంలో రూ.10వేలు, రూ.15 వేల చొప్పున పలువురి నుంచి లావాదేవీలు జరిగినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. లావాదేవీల స్క్రీన్ షాట్లను కలెక్టర్‌కు ఇచ్చారు. డీఈవో ఆఫీస్‌లో డబ్బుల వసూళ్లపై వచ్చిన ఫిర్యాదులపై హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తీవ్రంగా స్పందించారు. విద్యా శాఖ ఆఫీసులో ఏం జరుగుతున్నదని డీఈవోను ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ఆరోపణలు లేకుండా పరిపాలన కొనసాగాలని ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణిపై వచ్చిన ఫిర్యాదు విషయాలను డీఈవోకు పంపించారు. అనంతరం డీఈవో ప్రాథమికంగా విచారణ చేశారు. టీసీ బుక్కులకు పైసల వసూలుకు సంబంధించి శ్రీవాణిపై ఇప్పటికే పలుసార్లు ఫిర్యాదులు వచ్చాయని డీఈవో నిర్ధారించారు. ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది పలుసార్లు హెచ్చరించినా పునరావృతమవుతుండటంతో డీఈవో విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ అంశాల ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణిపై వచ్చిన ఫిర్యాదులు, లావాదేవీలకు సంబంధించి స్క్రీన్ షాట్లను, విచారణలోని అంశాలను ఆర్జేడీకి పంపించారు. అన్నింటినీ పరిశీలించిన ఆర్జేడీ కే సత్యనారాయణరెడ్డి గురువారం శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో నివేదిక మేరకే శ్రీవాణిపై చర్యలు తీసుకున్నట్లు ఆర్జేడీ తెలిపారు. గెజిటెడ్ స్థాయి అధికారితో సమగ్ర విచారణ చేపడుతామన్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయం అన్ని ప్రైవేట్, ప్రభుత్వ స్కూళ్లకు అందిస్తుంది. నామమాత్రపు రుసుముతో ఈ బుక్కులను ప్రభుత్వం ఇస్తుంది. వంద సర్టిఫికెట్ల కాపీలు ఉండే బుక్కు ధర రూ.500 చొప్పున ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్లకు ఈ బుక్కుల జారీలో శ్రీవాణి అధికంగా వసూలు చేస్తున్నారని డీఈవోకు ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్‌కు నేరుగా, డీఈవోకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆర్జేడీ చర్యలు తీసుకున్నారు.

### సీల్డ్ కవరు వచ్చింది

– డీఈవో ఎండీ అబ్దుల్ హై

హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీవాణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో ఈ అంశాన్ని ఆర్జేడీ ఆఫీసుకు నివేదించాం. శ్రీవాణిని సస్పెండ్ చేస్తున్నట్లు అక్కడి నుంచి సీల్డ్ కవరు వచ్చింది. దీన్ని ఆమెకు పంపించాము.

## గుడుంబా స్థావరంపై దాడి

- 600 లీటర్ల పానకం ధ్వంసం, 24 లీటర్ల గుడుంబా స్వాధీనం
- తయారీదారుపై కేసు నమోదు

రేగొండ, డిసెంబర్ 14 : గుడుంబా తయారీ కేంద్రంపై దాడి చేసి పానకంతో పాటు సారాను స్వాధీనం చేసుకొని నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలకేంద్రం పరిధిలోని రావులపల్లెకు చెందిన పెండల సుగుణ గుడుంబా తయారు చేస్తున్నదనే సమాచారంతో సిబ్బందితో కలిసి గురువారం స్థావరంపై దాడిచేసినట్లు చెప్పారు. ఇంటి ఆవరణలో ఆరు డ్రమ్ముల్లో చక్కెరతో పాటు డైయిస్తు పౌడర్‌తో కలిపిన పానకం 600 లీటర్లను ధ్వంసం చేసి, నిల్వ ఉన్న 24 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిర్వాహకురాలు పెండల సుగుణపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది రఘుపతి, రాజేందర్, బాలకృష్ణ, రాజేష్, ముజాఫర్ పాల్గొన్నారు.


పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గణపురం, డిసెంబర్ 14 : మండలంలోని చెల్పూర్ కేటీపీపీ పాఠశాల విద్యార్థులు అండర్–14, అండర్–17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. అండర్–14 విభాగంలో సాత్విక, మనస్విని, శివకాశి, అండర్–17 విభాగంలో ఏ తనుష్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను కేటీపీపీ సీఈ సిద్దయ్య అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో కేటీపీపీ సీఈ సిద్దయ్య

# వరుణ్‌రెడ్డి.. ఎన్పీడీసీఎల్ సీఎండీ

- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు
- వరుణ్‌రెడ్డిది 2019 ఐఏఎస్ బ్యాచ్

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 14: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో 1637ను విడుదల చేశారు. గతంలో ఎన్పీడీసీఎల్ సీఎండీగా కార్తికేయ మిశ్రా ఐఏఎస్ ఆఫీసర్ పని చేశారు. ఆ తర్వాత సీఎండీగా అన్నమనేని గోపాల్‌రావు కొనసాగారు. ప్రస్తుతం గోపాల్‌రావు పదవీ కాలం పూర్తికావడంతో 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి వరుణ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.